అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలి



జలమండలి ఎండీ అశోక్‌రెడ్డితో సమస్యలపై చర్చిస్తున్న ఎమ్మెల్యే

జలమండలి ఎండీని కలిసిన ఎమ్మెల్యే గాంధీ

గచ్చిబౌలి: శేరిలింగంపల్లి నియోజకవర్గంలో డ్రైనేజీ, మంచినీటి పైప్‌లైన్ల పనులకు నిధులు కేటాయించాలని జలమండలి ఎండీ అశోక్‌ రెడ్డిని పీఏసీ చైర్మన్‌, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ కోరారు. బుధవారం ఆయనను కలిసిన గాంధీ పలు సమస్యలపై చర్చించారు. నియోజకవర్గంలో నెలకొన్న డ్రైనేజీ సమస్య, మంచినీటి పైపులైన్‌ పనులకు నిధులు మంజూరు చేయాలని కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి నిధుల మంజూరుకు హామీ ఇచ్చారని గాంధీ తెలిపారు. కార్యక్రమంలో మియాపూర్‌ కార్పొరేటర్‌ ఉప్పలపాటి శ్రీకాంత్‌ తదితరులు ఉన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకం మహిళల జీవితాల్లో కొత్త వెలుగులు నింపుతోందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌ రెడ్డి అన్నారు. బుధవారం మండల పరిషత్‌ కార్యాలయంలో పథకం లబ్ధిదారులకు సబ్సిడీ గ్యాస్‌ ప్రొసీడింగ్‌ పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్‌ ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రకటించిన ఆరు గ్యారంటీలలో భాగంగా అర్హులైన ప్రతి కుటుంబానికి 500 రూపాయలకే గ్యాస్‌ సిలిండర్‌ అందించడం జరుగుతుందని తెలిపారు. నియోజకవర్గం వ్యాప్తంగా 35 వేల మంది లబ్ధిదారులకు సబ్సిడీ అందుతుందని తెలిపారు. ప్రజల సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు మెట్టుకుమార్‌ యాదవ్‌, సింధు ఆదర్శ్‌రెడ్డి, పుష్ప నగేష్‌, ప్రత్యేక అధికారి దేవుజ, తహసీల్దార్‌ రంగారావు, ఎంపీడీఓ యాదగిరి, జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్‌ సురేష్‌, మార్కెట్‌ కమిటీ మాజీ చైర్మన్‌ విజయ్‌కుమార్‌, రేషన్‌ డీలర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షులు రాజు తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌సీయూ ప్రొఫెసర్‌కు అరుదైన అవకాశం



ప్రొ.అలోక్‌సింగ్‌

రాయదుర్గం: హైదరాబాద్‌ సెంట్రల్‌ యూనివర్సిటీ ప్రొఫెసర్‌కు అరుదైన అవకాశం లభించింది. హెచ్‌సీయూలోని స్కూల్‌ ఆఫ్‌ కంప్యూటర్‌ అండ్‌ ఇన్ఫర్మేషన్‌ సైన్సెస్‌ (ఎస్‌సీఐఎస్‌)లో ప్రొఫెసర్‌ డాక్టర్‌ అలోక్‌సింగ్‌కు అప్లికేషన్‌, అడ్వాన్స్‌మెంట్‌, కన్వర్జన్స్‌లో పరిశోధనను ప్రచురించే క్యూ1 జర్నల్‌, అప్లైడ్‌ సాఫ్ట్‌ కంప్యూటింగ్‌ ఏరియా ఎడిటర్‌గా నియమితులయ్యారు. అంతకుముందు ఆయన అసోసియేట్‌ ఎడిటర్‌గా ఉన్నారు.

సమస్యలు పరిష్కరించండి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్‌ మున్సిపాలిటీ పరిధిలోని గేటెడ్‌ కమ్యూనిటీ కాలనీలోని సమస్యలను పరిష్కరించాలని తెల్లాపూర్‌ నైబర్‌హుడ్‌ అసోసియేషన్‌ అధ్యక్షులు ఈశ్వర్‌గారి రమణ కోరారు. బుధవారం విలేకరులతో మాట్లాడుతూ గత కొన్ని ఏళ్లుగా రోడ్లు, డ్రైనేజీ సమస్యలతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారని, ఈ సమస్యలను జిల్లా అధికారుల దృష్టికి తీసుకువెళ్లామన్నారు. పలుచోట్ల రోడ్లు అసంపూర్తిగా ఉండడంతో ప్రయాణ ఇబ్బందులతో పాటు నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. వెంటనే అధికారులు స్పందించి రోడ్లను అభివృద్ధి చేయాలని కోరారు.



మల్కంచెరువులో వ్యర్థాలు తొలగించిన దృశ్యం



మాదాపూర్‌లోని దుర్గంచెరువు వద్ద ..

జంట సర్కిళ్లలో 10,464 విగ్రహాల నిమజ్జనం

20వ తేదీ వరకు కొనసాగనున్న నిమజ్జనాలు ● ఎప్పటికప్పుడు వ్యర్థాల తొలగింపు





మియాపూర్‌ గురునాథం చెరువు కోనేరును శుభ్రం చేస్తున్న సిబ్బంది

శేరిలింగంపల్లి/చందానగర్‌/మియాపూర్‌: వాడవాడలా కొలువుదీరిన గణనాథులు గంగమ్మ ఒడికి చేరుకున్నారు. శేరిలింగంపల్లి జంట సర్కిళ్ల పరిధిలో వేలాది విగ్రహాలు నిమజ్జనం చేశారు. నిమజ్జన ప్రక్రియ ప్రశాంతంగా ముగియడంతో అధికార యంత్రాంగం ఊపిరి పీల్చుకున్నారు.కాగా ఇంకా కొన్నిచోట్ల నిమజ్జనాలు కొనసాగుతున్నాయి. ఈనెల 20వ తేదీ వరకు నిమజ్జనాలు జరుగుతాయని అధికారులు భావిస్తున్నారు. శేరిలింగంపల్లి జంట సర్కిళ్ల పరిధిలో 10,464 విగ్రహాలను నిమజ్జనం చేశారు. అందులో శేరిలింగంపల్లి సర్కిల్‌ పరిధిలో 6,529 విగ్రహాలు, చందానగర్‌ సర్కిల్‌ పరిధిలో 3,935 విగ్రహాలు నిమజ్జనం చేసినట్లు అధికారులు తెలిపారు.అందులో శేరిలింగంపల్లి సర్కిల్‌లో అత్యధికంగా మాదాపూర్‌ దుర్గం చెరువులో 2,809 విగ్రహాలు, చందానగర్‌ సర్కిల్‌ పరిధిలో కొత్తకుంట చెరువులో 2,059 విగ్రహాలు నిమజ్జనం చేశారు. గోపిచెరువు, దుర్గంచెరువు, మల్కంచెరువు, కొత్తకుంట, కాయిదమ్మకుంట, గురునాథం చెరువు గోపన్‌పల్లిలోని చెరువు, లింగంపల్లిలోని చాకలిచెరువు, పీజేఆర్‌ స్టేడియం, ఎక్స్‌కేవెట్‌ బేబీపాండ్‌లు కొత్తగా ఏర్పాటు చేయగా ఆయా చోట్ల నిమజ్జనం చేశారు. గణేష్‌ నిమజ్జనాలపై గత 15 రోజులుగా జీహెచ్‌ఎంసీ, సైబరాబాద్‌ పోలీసులు సమన్వయంతో ముందుకు సాగుతూ ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకున్నారు.

చెరువులు శుభ్రం

నిమజ్జన కోనేర్లను ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తుండడంతో చెరువులు శుభ్రంగా కనిపించాయి. బుధవారం అన్ని చోట్ల కోనేర్లలో పేరుకుపోయిన వ్యర్థాలు, పూజాసామగ్రి, విగ్రహాలను ఎప్పటికప్పుడు తొలగించి వాటిని వెంటనే వాహనాల్లో డంపింగ్‌యార్డ్‌కు తరలించారు.

సర్కిళ్లలో చెరువుల వారీగా విగ్రహాల నిమజ్జనం వివరాలు..

శేరిలింగంపల్లి సర్కిల్‌ పరిధిలో..		చందానగర్‌ సర్కిల్‌ పరిధిలో..	
గోపిచెరువులో	1,200	కొత్తకుంట చెరువులో	2,059
దుర్గంచెరువులో	2,809	కాయిదమ్మకుంటలో	1,042
మల్కంచెరువులో	1,290	గురునాథం చెరువులో	450
నల్లగండ్ల చెరువులో	924	ఎక్స్‌కేవేటెడ్‌ బేబీపాండ్‌లో	187
గోపన్‌పల్లిచెరువు బేబీపాండ్‌	252	పీజేఆర్‌ స్టేడియంలోనిపాండ్‌	197
చాకలిచెరువు బేబీపాండ్‌	54	మొత్తం	3,935
మొత్తం	6,529		

దరఖాస్తుల ఆహ్వానం

రాయదుర్గం: మౌలానా ఆజాద్‌ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలోని ఇండస్ట్రియల్‌ ట్రెనింగ్‌ ఇన్‌స్టిట్యూట్‌(ఐటీఐ) హైదరాబాద్‌ క్యాంపస్‌లో ఐటీఐ ట్రేడ్‌లలో అడ్మిషన్లకు దరఖాస్తు చేసుకోవాలని 'మనూ' ఐటీఐ ప్రిన్సిపల్‌ డాక్టర్‌ అర్షియా ఆజమ్‌ బుధవారం తెలిపారు. పూర్తి చేసిన దరఖాస్తులను సమర్పించడానికి ఈనెల 23వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. గచ్చిబౌలిలోని 'మనూ' క్యాంపస్‌లోని ఐటీఐ ద్వారా దరఖాస్తులను పొందవచ్చని, లేనట్లయితే విశ్వవిద్యాలయం వెబ్‌సైట్‌లో నుంచి డౌన్‌లోడ్‌ చేసుకోవాలని సూచించారు. కౌన్సిలింగ్‌ను ఈనెల 25వ తేదీన ఉదయం 9.30 గంటలకు గచ్చిబౌలిలోని 'మనూ' క్యాంపస్‌లోని ఐటీఐ భవనంలో నిర్వహించడం జరుగుతుందన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్‌ నంబర్‌ 040–23008428, 9440692452లో సంప్రదించాలని కోరారు.

హెచ్‌సీయూలో 'స్వచ్ఛతా హీ సేవ' షురూ

అక్టోబర్‌ 2 వరకు 'క్లీనప్‌ డ్రైవ్‌'



క్యాంపస్‌లో వ్యర్థాలను తొలగిస్తున్న విద్యార్థులు

రాయదుర్గం: మహాత్మాగాంధీ జయంతిని పురస్కరించుకొని గచ్చిబౌలిలోని హైదరాబాద్‌ సెంట్రల్‌ యూనివర్సిటీలో 'స్వచ్ఛతా హీ సేవ' పేరిట ప్రత్యేక క్లీనప్‌ డ్రైవ్‌ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అక్టోబర్‌ 2వ తేదీ వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఎన్‌ఎస్‌ఎస్‌ కోఆర్డినేటర్‌ డాక్టర్‌ బి కృష్ణయ్య పర్యవేక్షణలో హెచ్‌సీయూ ఉద్యానవన విభాగం, పారిశుద్ధ్య విభాగం ఆధ్వర్యంలో వ్యర్థాలను తొలగించారు. క్యాంపస్‌ను క్లీన్‌ అండ్‌ గ్రీన్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యం అని అన్నారు.

కొత్తగూడ గణేష్‌ లడ్డూ రూ.9 లక్షలు



గచ్చిబౌలి: కొత్తగూడ గణేష్‌ లడ్డూ సుమారోజు రాఘవేంద్రచారి రూ.9,0,1001 సొంతం చేసుకున్నారు మంగళవారం రాత్రి కొత్తగూడ గణేష్‌ ఉత్సవ కమిటీ సభ్యులు లడ్డూ వేలం వేశారు. ఎంఆర్‌సీ జువెలర్స్‌ యజమాని రాఘవేంద్రచారీ వేలం పాటలో దక్కించుకున్నారు. మేళతాళాలతో ఊరేగింపుగా ఇంటికి తీసుకెళ్లారు.

జేఎన్‌వీ ప్రవేశ పరీక్ష గడువు పెంపు

రాయదుర్గం: జవహర్‌ నవోదయ విద్యాలయలో ఆరవ తరగతిలో చేరడానికి దరఖాస్తుల సమర్పణకు గడువు తేదీని ఈనెల 23వ తేదీ వరకు పొడిగించడం జరిగిందని జవహర్‌ నవోదయ విద్యాలయ రంగారెడ్డిజిల్లా ప్రిన్సిపల్‌ డి విజయభాస్కర్‌ బుధవారం తెలిపారు. 2025–26 విద్యా సంవత్సరానికి ఆరవ తరగతి ప్రవేశ పరీక్షను 2025 జనవరి 18న నిర్వహిస్తారని ఆయన వివరించారు. ఉమ్మడి రంగారెడ్డిజిల్లా పరిధిలోని రంగారెడ్డి, మేడ్చల్‌, వికారాబాద్‌ జిల్లాలకు చెందిన ప్రస్తుతం 5వ తరగతి విద్యార్థులు ఈ ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ దరఖాస్తులను ఆన్‌లైన్‌ ద్వారా సమర్పించాలని సూచించారు. ఈ గడువు తేదీ పెంపుతో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పరిధిలో ఇప్పటి వరకు దరఖాస్తు చేసుకోని వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఏడాదిగా.. నిత్యం మురుగు సమస్య



హుడా ట్రేడ్‌ సెంటర్‌ కాలనీ గాంధీ అపార్టుమెంట్‌ సీ బ్లాక్‌ వద్ద రోడ్డుపై డ్రైనేజీ

హుడా ట్రేడ్‌ సెంటర్‌ కాలనీవాసుల ఆవేదన

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి డివిజన్‌ పరిధిలోని హుడా ట్రేడ్‌ సెంటర్‌ కాలనీలో ఏడాదిగా డ్రైనేజీ సమస్యతో స్థానిక ప్రజలు నిత్యం నరకయాతన పడుతున్నారు. రెండు దశాబ్దాల క్రితం వేసిన డ్రైనేజీ లైన్‌ ప్రస్తుత అవసరాలకు సరిపోకపోవడంతో సమస్య తరచూ పునరావృతం అవుతోంది. ఈ సమస్యపై హైదరాబాద్‌ మెట్రో వాటర్‌ సప్లయ్‌ అండ్‌ సీవరేజ్‌ బోర్డు అధికారులకు, జీహెచ్‌ఎంసీ అధికారులకు పలుమార్లు విన్నవించినా ఫలితం లేదని స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఆ మార్గంలో రాకపోకలు సాగించేందుకు ఇబ్బందుల పాలవుతున్నారు. ఒక వైపు మురుగు, మరో వైపు దుర్వాసనతో సతమతం అవుతున్నారు. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.



కాలనీ ప్రధాన రోడ్డు దెబ్బతిన్న దృశ్యం

'మనూ'లో 'ఏక్‌ పేడ్‌ మా కే నామ్‌'



మొక్కలు నాటుతున్న అధికారులు

రాయదుర్గం: స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా మనూలో 'ఏక్‌ పేడ్‌ మా కే నామ్‌' పేరిట మొక్కలు నాటే కార్యక్రమానికి బుధవారం శ్రీకారం చుట్టారు. పర్యావరణ సుస్థిరతను పెంపొందించడానికి మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. 'మనూ నోడల్‌ అధికారి ప్రొఫెసర్‌ మహ్మద్‌ ఫరియాద్‌ మాట్లాడుతూ విద్యార్థులు నాటిన మొక్కలను సంరక్షిస్తారని, హాస్టళ్లలో శుభ్రతా కార్యక్రమాలు చేపడుతున్నారని తెలిపారు.

11 మందికి జరిమానా

పటాన్‌చెరు టౌన్‌: డ్రంకెన్‌ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు 11మందికి రూ.2 వేల చొప్పున జరిమాన విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్‌ సీఐ లాలూనాయక్‌ తెలిపిన వివరాల ప్రకారం.. సోమ, మంగళవారాల్లో నిర్వహించిన డ్రంకెన్‌ డ్రైవ్‌లో 11 మందిని పట్టుకున్నట్లు చెప్పారు.పట్టుబడిన వాహనదారులను బుధవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా, జడ్జి 11 మందికి ఒక్కొక్కరికి రూ.2 వేలు చొప్పున జరిమాన విధించినట్లు ట్రాఫిక్‌ పోలీసులు పేర్కొన్నారు.

కాస్మోపాలిటిజం చాలా విస్తృతంగా విస్తరించింది

చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి



ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి పుష్పగుచ్ఛం ఇస్తున్న వీసీ ఐనుల్‌ హసన్‌

రాయదుర్గం: కాస్మోపాలిటిజం ప్రపంచవ్యాప్తంగా చాలా విస్తృతంగా విస్తరించిందని, ప్రతి ఒక్కరిని స్వాగతించే డెక్కన్‌ ఇంతటి విశ్వనగరంగా ఎదిగిందని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. గచ్చిబౌలిలోని మౌలానా ఆజాద్‌ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో బుధవారం కాస్మోపాలిటన్‌ డెక్కన్‌పై నిర్వహించిన సెమినార్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ హైదరాబాద్‌ పాతబస్తీలోని తన కుటుంబ అనుభవాల గురించి... నిజాం కాలంలో కొండా వెంకటరంగారెడ్డి పనిచేసిన విధానాన్ని ఆయన వివరించారు. సమావేశానికి అధ్యక్షత వహించిన 'మనూ' వీసీ ఐనుల్‌ హసన్‌ మాట్లాడుతూ దక్కన్‌ కాస్మోపాలిటన్‌ ప్రభావాలను వివరించారు. అనంతరం ప్రొఫెసర్‌ సలీల్‌ మహ్మద్‌,ఢిల్లీ ఉర్దూ యూనివర్సిటీ రిజిస్ట్రార్‌ సీమా అల్వీ, ప్రొఫెసర్‌ సల్మాఫారూఖీ, అభినారాయణ లంబా దక్కన్‌ స్మారక చిహ్నాల గురించి, ఆసిఫ్‌ మాలిద్‌ తదితరులు వివిధ అంశాలపై తమ అభిప్రాయాలను వివరించారు. అనంతరం కాస్మోపాలిటిజంపై చిత్ర ప్రదర్శనను తిలకించారు.

రేపు ఉచిత వైద్యశిబిరం

మోతీనగర్‌: మూసాపేట డివిజన్‌ మోతీనగర్‌ స్నేహపురి కాలనీలోని బడ్స్‌ ఇన్‌ బ్లూమ్స్‌ పాఠశాలలో అపోలో హాస్పిటల్‌ సౌజన్యంతో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు బడ్స్‌ ఇన్‌ బ్లూమ్స్‌ పాఠశాల డైరెక్టర్‌ శశిభూషణ్‌ బుధవారం పేర్కొన్నారు. ఈ నెల 20న శుక్రవారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పాఠశాల ఆవరణలో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. ఈ శిబిరంలో కొలెస్ట్రాల్‌, బ్లడ్‌ షుగర్‌ టెస్టు, డెంటల్‌, ఆర్థోపెడిక్‌ స్క్రీనింగ్‌తో పాటు సాధారణ వ్యాధులకు అవసరమైన వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేస్తారని తెలిపారు.

నేడు జాబ్‌మేళా

సంగారెడ్డి క్రైమ్‌: డీఆర్‌డీఓ ఆధ్వర్యంలో ఈనెల 19న ఉదయం 11 గంటలకు జాబ్‌ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా అధికారి అనిల్‌కుమార్‌ తెలిపారు. ఎస్‌ఎస్‌సీ, ఇంటర్‌, డిగ్రీ ఉత్తీర్ణత సాధించి ఉండాలని, వయసు 19 నుంచి 27 ఏళ్ల మధ్య ఉన్న వారు హాజరుకావాలని పాత డీఆర్‌డీఓ ఆఫీస్‌లోని జిల్లా ఉపాధి ఆఫీస్‌లో సంప్రదించాలని సూచించారు. వివరాలకు 08455–271010 నంబర్‌లో సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

గేమింగ్‌ టాలెంట్‌పై ఐఎస్‌బీతో విన్జో సంస్థ భాగస్వామ్యం

రాయదుర్గం: గేమింగ్‌ టాలెంట్‌ మెంటర్‌షిప్‌ ప్రోగ్రామ్‌ కోసం గచ్చిబౌలిలోని ఇండియన్‌ స్కూల్‌ ఆఫ్‌ బిజినెస్‌(ఐఎస్‌బీ)తో విన్జో సంస్థ భాగస్వామ్యం చేసుకుంది. రాబోయే పదేళ్లలో 60 బిలియన్‌ డాలర్ల రంగాన్ని సృష్టించే లక్ష్యంతో రెండు సంస్థలు సమష్టిగా కృషి చేస్తాయి. బుధవారం ఐఎస్‌బీలో ప్రతిష్టాత్మకంగా టాలెంట్‌ మెంటర్‌షిప్‌ ప్రోగ్రామ్‌, బ్యాటిల్‌ ఆఫ్‌ సూపర్‌ స్కాలర్స్‌(బీఓఎస్‌ఎస్‌)ని ప్రారంభించాయి. దేశంలోని ప్రతిభావంతులైన విద్యార్థులకు మార్గదర్శకత్వం చేయడం, సాంకేతిక ఆవిష్కరణలో భారతదేశ నాయకత్వాన్ని నడిపించడంలో అవసరమైన పరిజ్ఞానం అందించడం, ఐపీ ఎగుమతి ఆధారితంగా ఈ రంగ వృద్ధిని పెంచడం, అగ్రశ్రేణి గేమింగ్‌ మార్కెట్‌లలో భారతదేశాన్ని సమున్నతంగా నిలపడం వంటి వాటిని ప్రోత్సహించడమే ఈ భాగస్వామ్యం ప్రధాన లక్ష్యంగా పెట్టుకొని పనిచేస్తాయి.

నిమజ్జన వేడుకల్లో ఘర్షణ

ఇరు వర్గాలపై కేసు నమోదు

గచ్చిబౌలి: వినాయక నిమజ్జనం వేడుకల్లో ఘర్షణ నెలకొంది. యువకులు కుర్చీలు, కర్రలతో దాడులకు దిగడంతో ఇరు వర్గాలపై కేసు నమోదు చేశామని గచ్చిబౌలి ఇన్‌స్పెక్టర్‌ ఆంజనేయులు తెలిపారు. కొండాపూర్‌లోని హిందూ జై గణేష్‌ యూత్‌ అసోసియేషన్‌ మంగళవారం రాత్రి నిమజ్జనం వేడుకలు నిర్వహిస్తున్నారు. స్నేహితుల ఆహ్వానం మేరకు బంజారాహిల్స్‌కు చెందిన చందు, రమణదీప్‌ తదితరులు కొండాపూర్‌కు వచ్చారు. చిన్న విషయంలో వివాదం నెలకొనడంతో ఇరు వర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. బంజారాహిల్స్‌ నుంచి వచ్చిన యువకులు, యూత్‌ అసోసియేషన్‌ సభ్యులు కిరణ్‌, నీలం రవి తదితరులు పరస్పరం దాడులు చేసుకున్నారు. దీంతో ఇరు వర్గాలపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

చెత్త సమస్య తీరదా!



డంపింగ్‌ యార్డులో పేరుకుపోయిన చెత్త

నిజాంపేట్‌: నిజాంపేట్‌ మున్సిపల్‌ కార్పొరేషన్‌లో చెత్త సమస్య పరిష్కారం కావడం లేదు. రోజు రోజుకు పెరుగుతున్న జనాభాతో నిజాంపేట్‌ మున్సిపల్‌ కార్పొరేషన్‌లో చెత్త సమస్య తీవ్రమవుతోంది. సమస్య పరిష్కారానికి అధికారులు పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోవడంలో విఫలమవుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. నిజాంపేట్‌, ప్రగతినగర్‌, బాచుపల్లి ప్రాంతాల్లో ప్రతి రోజు సుమారు 120 టన్నుల వరకు చెత్తను సుమారు 200 వందల ఆటోలు ప్రతి రోజు సేకరిస్తున్నాయి.

◆ ప్రస్తుతం వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు ఉన్నందున ఈ చెత్త ఎక్కువ అయ్యింది. ఇలాంటి సమయంలో అధికారులు ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాల్సి ఉన్నా ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడంతో అనేక సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయి. అధికారులు చెత్త సమస్య పరిష్కారానికి చిత్తశుద్ధితో పని చేయకపోవడంతోనే సమస్య రోజురోజుకు జఠిలం అవుతోందని వివిధ కాలనీల ప్రజలు వాపోతున్నారు. ఇక్కడ నెలకొన్న సమస్యను పరిష్కరించాలని ఆటో కార్మికులు మున్సిపల్‌ కమిషనర్‌ సౌజన్యకు వినతి పత్రం అందజేశారు.

చెత్త డంపింగ్‌కు కండిషన్‌లు..

నిజాంపేట్‌ మున్సిపల్‌ కార్పొరేషన్‌లో చెత్తను డంపింగ్‌ చేసేందుకు చెత్త ఆటో కార్మికులకు అధికారులు కండిషన్‌లు పెట్టడం వల్ల గంటల తరబడి చెత్త డంపింగ్‌కు వచ్చిన ఆటోలు రోడ్డుపైనే వేచి ఉండాల్సిన పరిస్థితి వచ్చింది. ఒక్కో ఆటోకు సమారు రెండు గంటల వరకు చెత్త డంపింగ్‌కు సమయం పడుతుండటంతో కార్మికులు కాలనీల్లో అన్ని ప్రాంతాల్లో పూర్తిస్థాయిలో చెత్తను సేకరించలేకపోతున్నారని వివిధ కాలనీల ప్రజలు పేర్కొంటున్నారు.

ట్రాఫిక్‌ జామ్‌..

ప్రతి రోజు డంపింగ్‌ యార్డు వద్ద ప్రధాన రోడ్డుపై ఆటోలు గంటల తరబడి చెత్తను డంప్‌ చేసేందుకు వేచి ఉండటంతో రోడ్డు మొత్తం వాహనాలతో ట్రాఫిక్‌ జామ్‌ ఏర్పడుతోంది. నిజాంపేట్‌ నుంచి గండిమైసమ్మ రోడ్డు, ప్రగతి నగర్‌, సాయినగర్‌, రాజీవ్‌ గృహకల్ప వైపు రాకపోకలు సాగించేందుకు వాహనాలు డబుల్‌ బెడ్‌ రూమ్‌ల సముదాయం డంపింగ్‌ యార్డు నుంచే రాకపోకలు సాగించాలి. ఇలాంటి సందర్భంలో స్కూల్‌ బస్సులు, ఇంజనీరింగ్‌ కాలేజీ బస్సులు, ఇతర వాహనాలు ఎక్కువగా ఇదే రోడ్డులో వస్తుండటంతో ట్రాఫిక్‌ జాం అవుతోంది. ప్రజలు సమయం వృథా అవుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చెత్త పేరుకుపోతోంది..

ప్రతి రోజు డంపింగ్‌ యార్డులో వేసిన చెత్తను ఇక్కడి నుంచి జవహర్‌ నగర్‌ డంపింగ్‌ యార్డుకు తరలించాల్సి ఉంది. కానీ ఇది పూర్తి స్థాయిలో జరగకపోవడంతో టన్నుల కొద్దీ చెత్త డంపింగ్‌ యార్డులో పేరుకుపోతోంది. దీంతో పరిసర ప్రాంతాల ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి. ప్రతి రోజు సేకరించే చెత్తను సైతం ఎక్కడ వేయాలో తెలియని పరిస్థితి ప్రస్తుతం నెలకొందని ఆటో కార్మికులు వాపోతున్నారు. చెత్తను డంపింగ్‌ యార్డులోకి ఆటోలో తీసుకువెళ్లేందుకు కార్మికులు అష్టకష్టాలు పడాల్సిన పరిస్థితి ఉంది. ఒక వేళ లోపలికి పోయిన ఆటో తిరిగి బయటకు రావడానికి దారిలేకుండా చెత్త అక్కడ పేరుకుపోయిందంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.




చెత్త ఆటోలు లోపలికి వెళ్లేందుకు కూడా వీలు లేని పరిస్థితిలో డంపింగ్‌ యార్డు



సమస్యలపై కమిషనర్‌ సౌజన్యను కలిసిన ఆటో కార్మికులు

డంపింగ్‌ సమయాలు మార్చాలి..



చెత్తను డంపింగ్‌ యార్డులో వేసేందుకు ఉదయం 5 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకు మాత్రమే అనుమతి ఇస్తున్నారు. దీంతో మాకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఉదయం 4 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు డంపింగ్‌ కోసం సమయం ఇస్తే ఎలాంటి ఇబ్బందులు లేకుండా చెత్తను ఖాళీ చేసేందుకు అవకాశం ఉంటుంది.

– పరమేష్‌,ఆటో కార్మికుడు

ఆర్థిక ఇబ్బందులు..



ప్రతి రోజు ఇంటింటికి తిరిగి చెత్తను సేకరిస్తున్నాం దీంతో మా ఆటోకు ఖర్చులు, డీజిల్‌ ఇతర ఖర్చులు ఎక్కువ అవుతున్నాయి. అధికారులు మా గురించి ఆలోచించి ప్రతి నెలా ఒక్కో ఇంటి నుంచి కనీసం రూ. 100 అయినా ఇప్పించే ప్రయత్నం చేస్తే కొంత వెసులుబాటు ఉంటుంది. మాకుఇతర ఆదాయం లేదు. అధికారులు మా పరిస్థితిని సైతం అర్థం చేసుకోవాలి.

–రంగస్వామి

పనుల్లో నాణ్యత పాటించాలి

కూకట్‌పల్లి: ఆల్విన్‌కాలనీ డివిజన్‌ పరిధిలోని జయానగర్‌ కాలనీలో జంక్షన్‌ వద్ద 16 లక్షల రూపాయల నిధులతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను డివిజన్‌ కార్పొరేటర్‌ దొడ్ల వెంకటేష్‌ గౌడ్‌ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీసీ రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత విషయంలో రాజీపడకుండా యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. రోడ్డుపై వర్షపు నీరు నిలవకుండా ప్రణాళికతో పనులను పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఏఈ శ్రావణి, వర్క్‌ ఇన్‌స్పెక్టర్‌ రవి కుమార్‌, విష్ణు, వెంకట్‌రెడ్డి, కాలనీవాసులు పాల్గొన్నారు.



రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్‌ దొడ్ల వెంకటేష్‌గౌడ్‌